క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రొద్దం: మండలంలోని ఆర్.కొట్టాల పాత చెక్ పోస్టు వద్ద ఎంజేపీ పాఠశాల ఎదురుగా పావగడ-పెనుకొండ ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు కార్లు ఢీ కొన్నాయి. అయితే త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పావగడ వైపు నుంచి రొద్దం వైపు నుంచి వెళ్తున్న కార్లు అదుపుతప్పి ఢీ కొన్నట్లు స్థానికులు తెలిపారు. రెండు కార్లు ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

అన్నదాన సత్రానికి విరాళం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రం నిర్వహణకు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఎంహెచ్ రామాంజి రూ. 5 వేలు విరాళం అందజేశారు. దాతను కమిటీ సభ్యులు అభినందించారు.

గోమాతకు పూజలు



గోమాతను ఊరేగిస్తున్న సేవాసమితి సభ్యులు

లేపాక్షి: హిందూపురానికి చెందిన సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పి.సడ్లపల్లిలో శనివారం గోమాత పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీక్షేత్రం కైవారం తాతకు అభిషేకం, గురుపూజ, నగర సంకీర్తన, రథోత్సవం వైభవంగా చేపట్టారు. అనంతరం గోమాతను ఊరేగిస్తూ నగర సంకీర్తనలు చేవారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ రవిశంకర, డాక్టర్ మహేష్‌కుమార్, కమిటీ సభ్యులు రాగరాజు, నారాయణప్ప, రాజప్ప, గంగాధరస్వామి, భజన బృందాలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రేపు పావగడకు 'ముఖ్యమంత్రి చంద్రు'

పావగడ: అమ్ ఆద్మి పార్టీ రాజ్యాధ్యక్షుడు, కన్నడ ముఖ్యమంత్రి సినిమాలో ముఖ్యమంత్రిగా నటించి తన పేరును ముఖ్యమంత్రి చంద్రు గా మార్చుకున్న ప్రముఖ విలక్షణ నటుడు ముఖ్యమంత్రి చంద్రు సోమవారం పావగడలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా సంఘటనా కార్యదర్శి ఎన్ రామాంజినప్ప శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసు కునేందుకు రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని పాత బస్టాండు లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం తాలూకా లోని మరిదాసనహళ్లిలో మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వైఎన్ హొసకోటలో ర్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని రామాంజినప్ప కోరారు.


పౌష్టికాహారం తీసుకోవాలి



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పరిగి: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి నవీన తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తరచూ వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలని కౌన్సిలర్ సునిత, ఏబ్లాక్ కన్వీనర్ సాదిక్ అన్నారు. శనివారం 13వ వార్డు సడ్లపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలు పక్కన పడేసిన తీరును వివరించారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

పెనుకొండ రూరల్: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి శంకర రావు పేర్కొన్నారు. శనివారం పెనుకొండ కోర్టు ఆవరణవలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 173 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, ఏజీపీ భాస్కర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, శివశర్మ, నాగిరెడ్డి, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ: లోక్ అదాలత్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జడ్జి శంకరరావు



మడకశిర: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అశోక్‌కుమార్

లోక్‌అదాలత్‌లో 119 కేసుల పరిష్కారం

మడకశిరరూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 119 కేసులు పరిష్కరించారు. తొలుత జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగకుండా సత్వరమే న్యాయం అందించడానికి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు పరిష్కరించుకోవడానికి రాజీమార్గమే సరైనదన్నారు. అనంతరం లోక్‌అదాలత్‌లో 17 బ్యాంకు కేసులు పరిష్కరించి రూ.11,97,000 బ్యాంకులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. అలాగే 38 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.36,600, 41 ఎస్‌టీసీ కేసులకు రూ.13,700, 21 ఎక్సైజ్ కేసులకు రూ.1,13,215 జరిమానా విధించారు. రెండు సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నియోజకవర్గ యూనిటైడ్ పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి సమానత్వం కోసం ఏసుక్రీస్తు చెప్పిన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, వైస్ సర్పంచ్ వేణు, క్రైస్తవ సంఘం నాయకులు నాగరాజు, సుధాకర్, ఎల్లిఫార్చ్, విజయ్ కుమార్, మేజేస్, విక్టర్, పాల్ తిమోతి, సాజహాన్, ఎంపీటీసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న దృశ్యం

టీడీపీ నాయకుల కళ్లకు జనం కనిపించలేదా?

- తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన జనం టీడీపీ నాయకుల కళ్లకు కనిపించలేదా అన్ని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రశ్నించారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు గుర్తించి మడకశిరలో సామాజిక సాధికార యాత్రకు ఆయా వర్గాల ప్రజలు భారీగా తరలి వచ్చి యత్రను దిగ్విజయం చేశారన్నారు. సభలో బడుగు బలహీన వర్గాల సామాజిక సాధికారత వెల్లి విరిసిందని, ఇది టీడీపీ నాయకుల కళ్లకు కనిపించకపోవడం సిగ్గు చేటన్నారు. టీడీపీని ప్రజలు నమ్మరని గుర్తించి రాజకీయ లబ్ధిపొందడానికి ఆ పార్టీ నాయకులు బస్సు యాత్రపై చేసిన తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ అంతా ఓ బూటకమన్నారు. టీడీపీ నాయకులు నిర్వహించే బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారంటి కార్యక్రమానికి ప్రజల స్పందన కరువైందన్నారు. 2014లో ఎన్నికల ముందు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను తప్పారన్నారన్నారు. రైతు రుణమాఫీ కూడా చేయకుండా రైతులను మోసగించారని గుర్తు చేశారు. మహిళలు, రైతులు గుర్తించి టీడీపీని నమ్మమని చెబుతున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

ఘనంగా కనకదాస జయంతి

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి, బీదానిపల్లి తదితర గ్రామాల్లో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. వివిధ గ్రామాల మహిళలు కనక దాస విగ్రహానికి కలశాలతో ప్రదర్శన చేశారు. కనకదాస చిత్ర పటానికి వీధుల్లో ఊరేగించారు. గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు, కురుబలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



నారనాగేపల్లిలో కలశాలు మోస్తున్న మహిళలు

మండల కమిటీ ఎన్నిక

సోమందేపల్లి: ఏపీ రైతు సంఘం మండల కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా శనివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు కార్యదర్శిగా తిమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా సంజీవప్ప, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

హిందూపురం: కలెక్టర్ పట్ల ఫోన్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయమై హిందూపురం పట్టణానికి చెందిన చాంద్‌బాషాను శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లాతో చాంద్‌బాషా ఫోన్‌లో మాట్లాడుతూ కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే విషయంగా కేసు నమోదైంది. ఈక్రమంలో చాంద్‌బాషను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ విచారణ చేసి, అతడికి బెయిల్ మంజూరు చేశారు.

నేడు జ్యోతుల మహోత్సవం



అలంకరణలో పెద్దమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఉన్న పెద్దకోట్ల పెద్దమ్మకు ఆదివారం రాత్రి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గుడికట్లు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలోని పెద్దమ్మ దేవతకు ఏటా కార్తీక మాసంలో కాపులు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

హిందూపురం: పట్టణంలోని ఏఆర్ ఆసుపత్రి వద్ద శనివారం రాత్రి కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో కిందపడిన ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అయితే కారును నిలపకుండా వెళ్లిపోయారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వైఎస్ భారతి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణు

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని తదితరులు బెంగళూరు రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్ భారతి జన్మదినం సందర్భంగా ఆలయంలో అయ్యప్ప మాలధారులు, భక్తులకు అన్నదానం చేశారు.

'ఆడుదాం బెంగళూరు' పోస్టర్ల విడుదల

పెనుకొండ రూరల్: 'ఆడుదాం బెంగళూరు' పోస్టర్లను వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ చేతుల మీదుగా శనివారం విడుదల చేశారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా బెంగళూరులో నివాసం ఉంటున్న జగనన్న అభిమానుల కోసం ఐటీ వింగ్ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' స్ఫూర్తితో 'ఆడుదాం బెంగళూరు' పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23,24 తేదీల్లో క్రికెట్ టోర్నమెంట్‌ను బెంగళూరులోని సర్జాపూర్ రోడ్డు కొడతి గ్రామ సమీపంలో బీకే క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఐటీ వింగ్ సభ్యులు తెలిపారు.



ఎమ్మెల్యే చేతుల మీదుగా పోస్టర్లు విడుదల చేయిస్తున్న ఐటీ సభ్యులు

శనీశ్వరా.. కాపాడు తండ్రీ



శనీశ్వరుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఉచిత బస్సుల సౌకర్యంతో చిత్రదుర్గం, చళ్లకెర, దావణగెర, శివమొగ్గ, బెంగళూరు ప్రాంతాల నుంచి మహిళా భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నిర్వహించిన స్వామి వారి తైలాభిషేకం, నవగ్రహాల పూజల్లో భక్తులు పాల్గొన్నారు. శీతలాంబదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం కోటి ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొక్కులున్న భక్తులు కేశ ఖండన నిలయంలో స్వామికి తలనీలాలు సమర్పించు కున్నారు. తిరుగు ప్రయాణంలో మహిళలు ఉచిత బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



అలంకరణలో శనీశ్వరుడు

యువకుని కుటుంబానికి న్యాయం చేయాలి

లేపాక్షి: మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ శనివారం రాత్రి లేపాక్షిలో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల హిందూపురం నుంచి లేపాక్షికి వస్తున్న బాలాజీ(20) అనే వ్యక్తిని కొంతమంది వ్యక్తులు డబ్బుల కోసం కొట్టడంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందిన విషయం విదితమే. ఘటనపై హిందూపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలాజీ బంధువులు స్నేహితులు లేపాక్షి-హిందూపురం రోడ్డులోని కంచిసముద్రం క్రాస్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ గోపి మాట్లాడుతూ బాలాజీ మృతిపై హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు చేసామని, త్వరలో నిందుతులను అరెస్ట్ చేసి న్యాయం చేస్తామన్నారు.



రాస్తారోకో చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు

నేడు కెంపేగౌడ జయంతి

అమరాపురం: మండల కేంద్రంలో ఆదివారం కెంపేగౌడ, రాబహుదూర్ బసమయ్య జయంతి నిర్వహించనున్నట్లు కుంచిటి వక్కలిగ సంఘం నాయకులు తెలిపారు. కుంచిటి వక్కలిగ యూత్ సభ్యులు శనివారం జయంతి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలోని కుంచిటి వక్కలిగలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి'

హిందూపురం టౌన్: సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ స్థానిక నారాయణ కళాశాలలో తరగతులు నిర్వహిస్తుండడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి కళాశాలను బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ సెలవు రోజుల్లో కళాశాలను నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. నారాయణ కళాశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిహాల్, శ్రీనివాస్, నితీష్, ముద్దు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై అవగాహన



బుళ్లసముద్రంలో రైతులకు డ్రిప్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: బుళ్లసముద్రం పంచాయితీలో శనివారం ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో డ్రిప్, స్ప్రింక్లర్లు వాడకం, ప్రభుత్వం అందించే రాయితీలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంఐఏఓ నరసింహులు మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేసి మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉందన్నారు. నీటి సౌకర్యం ఉన్న ప్రతి రైతు డ్రిప్, స్ప్రింక్లర్లు ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. ప్రభుత్వం రాయితీతో అందించిన డ్రిప్ పరికరాలను పరిశీలించారు.

శ్రవణ యంత్రాల పంపిణీ

పావగడ: వేలాది రూపాయల విలువైన వినికిడి యంత్రాలను స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపకుడు స్వామి జపానంద ఉచితంగా అందించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఒకొక్కటి రూ.10 వేలు విలువ చేసే శ్రవణ యంత్రాలను 50 మందికి అమర్చారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్ శ్రవణ సంస్థ సహకారంతో నిరుపేదలకు శ్రవణ యంత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. వినికిడి కోల్పోయిన నిరుపేదలు ఆధార్ కార్డు, బీపీఎల్ కార్డు, రెండు పాస్‌ఫోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్‌పరిధి లోని రాజవంతి గ్రామం ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు...మడకశిరకు చెందిన లోకేశ్ రాజవంతి గ్రామంలోని తన బంధువు గోవిందరాజు ఇంటికి వచ్చాడు. మడకశిరకు వెళ్లే క్రమంలో ఆగి ఉన్న ప్రైవేటు బస్సు ఎక్కడానికి రోడ్డు దాటు తుండగా బెంగళూరు నుంచి పావగడకు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ప్రమాదంలో బాధితుడి తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నామని సీఐ గిరీశ్ తెలిపారు.

ఎమ్మెల్సీకి పరామర్శ



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఏపీ ఆగ్రోచైర్మన్ నవీన్‌నిశ్చల్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి గురువారం మృతిచెందిన విషయం విదితమే. వారు కొనకొండ్లకు వెళ్లి ఉమాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీని పరామర్శించారు.

ఎంపీడీఓ కార్యాలయానికి నూతన హంగులు



ఆకట్టుకుంటున్న చిలమత్తూరు ఎంపీడీఓ కార్యాలయం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నూతన శోభ సంతరించుకుంది. రంగులు వేయడంతో కార్యాలయం ఇటీవలే నిర్మించారా అనే విధంగా ఆకర్షిస్తోంది. ఎంపీపీ నిధులు రూ.3 లక్షలు వెచ్చించి కార్యాలయానికి రంగులు వేయించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన భవన నిర్మాణాలు, కార్యాలయ భవనాలకు మరమ్మతు చేయించడం ద్వారా అధికారులు, ప్రజలకు ఎంతో అనుకూలంగా మారాయంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా నగేష్‌బాబు

హిందూపురం టౌన్: బీజేపీ పట్టణాధ్యక్షుడిగా నగేష్ బాబును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హిందూపురం మండలాధ్యక్షుడిగా చక్రపాణిరెడ్డి, లేపాక్షి మండలాధ్యక్షుడిగా నరసింహమూర్తి, చిలమత్తూరు మండలాధ్యక్షుడిగా హరిప్రసాద్ రెడ్డిని నియమించారు.

జూదరుల అరెస్టు

సోమందేపల్లి:మండలంలోని కేతగాని చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,500 నగదు, ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి క్రాస్ వద్ద చిలమత్తూరు పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం మరవకొత్తపల్లి క్రాస్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా గోరంట్ల మండలానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి , నల్లపురెడ్డి వద్ద నుండి 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లు , బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: గోపిందేవరపల్లి చెరువు వద్ద లభించిన గుర్తు తెలియని అనాథ మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. చెరువు వద్ద మృతదేహం ఆచూకీ తెలియకపోవడంతో పంచనామా అనంతరం అంత్యక్రియల నిమిత్తం శనివారం లేపాక్షి ఏఎస్ఐ షర్ఫుద్దీన్, కానిస్టేబుల్ మల్లికార్జున స్థానిక ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్‌కు సమాచారమిచ్చారు. వారు స్పందించి పట్టణంలోని సాధారణ శ్మశాన వాటికలో పోలీసుల సమక్షంలో ఉమర్‌ఫారూక్‌తో పాటు షబ్బీర్, నౌషాద్, అతీఖుర్‌రెహమాన్, షాబాజ్ పాల్గొని అంత్యక్రియలు నిర్వహించారు.